క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



పూజలందుకున్న గ్రామదేవత గంగమ్మ

నల్లమాడ: కొత్తపల్లి తండాలో బుధవారం గ్రామదేవత గంగమ్మ జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పొట్టేళ్లు, కోళ్లు బలిచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖశాంతులతో ఉండేలా చూడాలని అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రతియేటా గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు తండా వాసులు తెలిపారు. కార్యక్రమంలో వేల్లమద్ది సర్పంచ్ బొజ్జేనాయక్, తండాపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పరుషకు ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న కోటి సూర్య ప్రకాష్ బాబు

ధర్మవరం రూరల్: బత్తలపల్లి మండలం కొడేకండ్ల గ్రామంలో ఈ నెల 7న జరిగే శ్రీ పెద్దయ్యస్వామి పెద్ద పరుష మహోత్సవానికి రావాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు ఆహ్వానించారు. బుధవారం ఆయన కళ్యాణదుర్గంలోని మంత్రి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

కూలీల సంఖ్య పెంచాలి

గాండ్లపెంట: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి కేటాయించిన కూలీలు పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజువారీ కూలి రూ.272 వచ్చేలా పని కల్పించాలన్నారు. పనుల సమయంలో యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు.సమావేశంలో ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



బోరును పరిశీలిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో కమ్మవారిపల్లి సమీపంలోని దొమ్మిరి గుడిసెల కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి హామీ ఇచ్చారు. బుధవారం నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్ర, మున్సిపల్ ఇంజినీర్ స్వాతితో కలసి కాలనీలో ఆయన పర్యటించారు. రేషన్ బియ్యం అందించే వాహనం రావడం లేదని కాలనీవాసులు వారికి తెలిపారు. అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని, వారు హామీ ఇచ్చారు.

విద్యుత్ కోతలు నివారించాలి

కొత్తచెరువు: అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు నరేందర్ రెడ్డి, అలివేలమ్మ, ఎంపీటీసీ రఫీ మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ ఏ సమయంలో పోతుందో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏఈ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ త్వరలో కొత్తచెరువులో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ఐకేపీ కార్యాలయంలో వెలుగు సిబ్బంది అవినీతికి పాల్పడ్డారని, విచారణ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి, ఉపాధ్యక్షులు సరళ, గంగరాజు, అధికారులు ఉన్నారు.

నైతిక విలువల పెంపే లక్ష్యం



కదిరిలోని జోర్డాన్ బ్లెస్సింగ్ చర్చిలో నిర్వహిస్తున్న వెకేషన్ బైబిల్ స్కూల్

కదిరి: జిల్లాలోని ప్రార్థనా మందిరాల్లో 'వెకేషన్ బైబిల్ స్కూల్' పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పిల్లలకు బైబిల్‌లో ఉన్న అంశాలతో పాటు నైతిక విలువలతో కూడిన పాఠాలు చెబుతున్నారు. వీటిపై కదిరిలోని జోర్డాన్ బ్లెస్సింగ్ చర్చి ఫాస్టర్ రెవ.డాక్టర్ విద్యాసాగర్ బుధవారం మాట్లాడుతూ నైతిక విలువల పెంపే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇది నా అదృష్టం

- తాను జన్మించిన ఆస్పత్రిలో నూతన భవనం ప్రారంభంపై ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



నూతన పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

తలుపుల: తాను జన్మించిన ఆస్పత్రిలోనే అత్యాధునిక వసతులతో కూడిన నూతన భవనాన్ని ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ పి.వి. సిద్ధారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.1.88 కోట్లతో నిర్మించిన నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి, వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గదులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలతో పీహెచ్‌సీలు నిర్మించే కార్యక్రమం చేపట్టారన్నారు. 14 ఏళ్ల తెలుగుదేశం పార్టీ హయాంలో ఎంత అభివృద్ధి చేశారో, తాము వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి చేశామో చూడాలని సూచించారు. రోడ్లులేని గ్రామాలకు కోట్లాది రూపాయలతో దారి సౌకర్యం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. మండలంలో నూతన పీహెచ్‌సీ, కస్తూరి బా గురుకుల పాఠశాలలో ఇంటర్ కళాశాల, 13 సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, తన ఆశయంగా చేపట్టిన హంద్రీనీవా టన్నెల్ పూర్తి చేశామన్నారు. అభివృద్ధి పనులు పచ్చపార్టీ నేతలకు కనపడలేదా అని ప్రశ్నించారు. అనంతరం నూతన పీహెచ్‌సీ పనులను త్వరితగతిన పూర్తిచేసి అప్పగించిన కాంట్రాక్టర్ పురుషోత్తంరెడ్డిని ఎమ్మెల్యే, వైద్యాధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫినాయక్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ సింగల్‌విండో అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, పయాజ్ అహమ్మద్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ మైనుద్దీన్, సర్పంచ్‌లు శ్రీలత, శ్రీరామ్‌రెడ్డి, సుగుణమ్మ, షేక్షావలి, వెంకటనారాయణ, సుదర్శన్‌రెడ్డి, వెంకటపతినాయుడు, అగ్రి బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, టోపీరమణ, మదుసూదన్‌రెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తలుపుల: మండలంలోని జ్యోతివాండ్లపల్లి తండాలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహంతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, రామ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం గంజివారిపల్లి–వేపమానిపేటకు ఎన్‌ఆర్‌జీఎస్‌లో చేస్తున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కాగా, మారెమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి కూడా ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్‌ఓబీ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

- నిర్వాసితులకు అన్ని విధాలా సాయమందిస్తాం: ఎమ్మెల్యే కేతిరెడ్డి హామీ

ధర్మవరం: కదిరిగేట్ వద్ద నుంచి మార్కెట్‌యార్డు వరకు నూతనంగా నిర్మించనున్న ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)తో ఇళ్లను కోల్పోతున్న నిర్వాసితులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి బుధవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 62 మందికి పుట్టపర్తి–ధర్మవరం ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం మాత్రమే ఇవ్వాలని చట్టంలో ఉన్నా వారికి మరింత సాయం అందించేందుకు ఇంటిస్థలంతో పాటు అర్హులైన వారికి గృహనిర్మాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మరో పది రోజుల్లో నిర్వాసితుల ఖాతాలలో పరిహారం జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యోగీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ..

రామ్‌నగర్‌కు చెందిన చేనేత కార్మికురాలు శోభ కుమార్తె బుద్ధిమాంద్యంతో బాధపడుతోంది. ఆమె చికిత్స నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే కేతిరెడ్డి పంపిణీ చేశారు. బాలిక పరిస్థితి చూసి చలించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రభుత్వం నుంచి పరిహార చెక్కును త్వరితగతిన విడుదల చేయించారు. భవిష్యత్‌లో మరింత సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

లక్ష్యంతో ముందుకెళ్తే విజయం తథ్యం

ధర్మవరం: ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళితే విజయం తథ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలను మరింత మెరుగుపరచడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో అనేక పథకాలను అందిస్తున్నారని తెలిపారు. మార్చి 29న నిర్వహించిన ఉద్యోగమేళాలో ప్రతిభ కనబరిచిన 35 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలస్వామి, టీపీఓ జెసింత్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు జగనన్న



లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న అందరివాడు అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని దండోరాకాలనీ, ఆదర్శనగర్‌లో బుధవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని మహిళలను అడిగారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతోందని మహిళలు తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దోచుకున్నారన్నారు. మన అందరి ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. అందరి మేలు కోరుతున్న జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, సర్పంచ్ తేజశ్వాణి, ఎంపీటీసీ సభ్యులు గాయత్రిదేవి, వడ్డే శీనా, నాయకులు ధనుంజయయాదవ్, పార్టీ మండల కన్వీనర్ బండి పవన్, యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, పంచాయతీ వార్డు మెంబర్లు ఫర్హానా, రామస్వామి, రామలక్ష్మీ, అన్ను, స్థానిక నాయకులు రమేష్, సూరి, సాయిరామ్, కృష్ణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన వైద్యం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడిమర్రి: వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో గ్రామాల్లోనే మెరుగైన వైద్యం లభిస్తుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఏబీ ఓబిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాలను ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డితో కలసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో తలనొప్పి వచ్చినా, జ్వరం వచ్చినా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. గ్రామీణ ప్రజల అవస్థలు తీర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామ పంచాయతీల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి, వాటిలో వైద్య చికిత్సలు అందించడానికి ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలను నియమించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహేంద్రనాథ్, ఏఓ సాయిప్రసాద్ శర్మ, పంచాయతీ కార్యదర్శి అశోక్, వీఆర్‌ఓ రాముడు, ఆరోగ్య కార్యకర్త హర్షవర్ధన్‌రెడ్డి, ఏఎన్‌ఎం లక్ష్మీకాంతమ్మ, మాజీ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతరెడ్డి, తిమ్మారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సాయినాథ్‌రెడ్డి, సన్నప్పయ్య, హరినాథ్, నన్నేసాబ్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు తనిఖీ



రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లిలో ఉన్న ఓ రైస్‌మిల్లును బుధవారం తహసీల్దార్ దేవేంద్ర నాయక్, సీఎస్‌డీటీ షబ్నామ్, వ్యవసాయ సహాయకులు ఓబులేసుతో కలిసి తనిఖీ చేశారు. రైస్‌మిల్లుకు సంబంధించిన బీ రిజిస్టర్, ఎంఎస్‌పీ బుక్కులు, వే బిల్లులతో పాటు ఇతర రికార్డులు అందుబాటులో లేకపోవడంపై యజమాని రంగారెడ్డిని అధికారులు ప్రశ్నించారు. రికార్డులను గురువారం సమర్పిస్తానని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దేవేంద్రనాయక్ మాట్లాడుతూ రెడ్డిపల్లిలోని రంగారెడ్డి రైస్‌మిల్‌పై ఇటీవల ఫిర్యాదులు అధికంగా రావడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. గడువులోగా రికార్డులు సమర్పించని పక్షంలో మిల్లు నిర్వాహకుడిపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. చౌక ధాన్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

దారి కష్టాలు ఇక దూరం..



కొండకమర్ల నుంచి గౌరాపురం వరకు తారురోడ్డు వేస్తున్న దశ్యం

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల నుంచి గౌరాపురం వరకు 8 కిలోమీటర్ల మేర ధ్వంసమైన తారురోడ్డుపై కొత్తగా రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండకమర్ల, నాయనవారిపల్లి, కమ్మవారిపల్లి, కాటంరెడ్డిపల్లి, అచ్చామియాపల్లి, చల్లవాండ్లపల్లి, బాలప్పగారిపల్లి, గౌరాపురం తదితర గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయితే, ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు సమస్యను పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కొత్తగా తారు రోడ్డు వేయాలని అధికారులకు ఆదేశించడంతో.. బుధవారం కొండకమర్ల నుంచి గౌరాపురం వరకు తారురోడ్డు పనులు చేపట్టారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ధర్మవరం రూరల్: బత్తలపల్లి మండలం జ్వాలాపురం గ్రామంలో బుధవారం లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీ కాంత్, ఈఓ బీఆర్ వెంకటేశులు, మధుసూదన్, క్రిష్ణమాచార్యులు తదితరులు హాజరయ్యారు.

మేలు జాతి లేగ దూడల ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో బుధవారం మేలు జాతి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప సంచాలకులు డాక్టర్ వి. సుధాకర్, ధర్మవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. దూడల ఎదుగుదల, పునరుత్పత్తి, లింగ నిర్ధారిత వీర్యం ప్రాముఖ్యత, ముర్రుపాల ప్రాముఖ్యత, ఖనిజ లవణాలు, నట్టల నివారణ మందుల వాడకం తదితర వాటి గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. కాల్షియం టానిక్కులు, నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వెంకటనారాయణకు చెందిన గిర్ జాతి దూడకు మొదటి బహుమతి, జనార్ధన్ నాయుడుకు చెందిన జెర్సీ దూడకు రెండవ బహుమతి, గోపాల్‌కు చెందిన గిర్ జాతి దూడకు మూడవ బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఏడీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి, డాక్టర్ స్వర్ణలత, సిబ్బంది సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

పుట్టపర్తి టౌన్: కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ కూడలిలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలోని ఒక్క అంశాన్ని కూడా అమలు చేయాలేదన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించిన గొప్ప కర్మాగారమని, దానిని ప్రధాని మోదీ కార్పొరేటర్లకు అప్పజెప్పేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ప్రైవేటీకరణ చేస్తే 20 వేల మంది కార్మికులు రోడ్డున పడతారన్నారు. కార్మికుల పొట్టకొట్టే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఏఐటీయూసీ నాయకులు గౌస్‌లాజమ్, జయలక్ష్మి, సీపీఐ నాయకులు వెంకటనారాయణ, వెంకటరమణ, ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మి, తదితరులున్నారు.

సీపీఐ, సీపీఎం నాయకుల ఆందోళన

తనకల్లు: విశాఖ ఉక్కు కార్మాగారాన్ని ప్రైవేటీకరణ ప్రతిపాదనను నిరసిస్తూ స్థానిక జాతీయ రహదారిపై బుధవారం సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. వెంటనే ఆ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కన్వీనర్ రెడ్డెప్ప, రైతు సంఘం అధ్యక్షుడు చౌడప్పయాదవ్, కార్యదర్శి ఇక్బాల్, సహాయ కార్యదర్శి కరీముల్లా, సీపీఎం నాయకుడు శివన్న తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన దాతృత్వం

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని దాతృత్వం వెల్లివిరిసింది. బుధవారం పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాల వారు భక్తుల కోసం అల్పాహారం, ప్రసాదాలు, మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేసి పెద్ద మనసు చాటుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అల్పాహారం అందించారు. అన్నమయ్య సేవా మండలి సభ్యులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తూ ఆకట్టుకున్నారు. గాజులు, బొమ్మలు, కమ్మలు, దండల కొనుగోలులో మహిళలు బిజీ అయ్యారు.



గీతం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో కురుబ కులస్తులు నూతనంగా నిర్మించిన కుర్లపల్లయ్యస్వామి ఆలయానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. బుధవారం గ్రామంలో జరిగిన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన విచ్చేసి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ పూజారికి లక్ష రూపాయల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకుడు హనుమంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10 లోగా పేర్లను కళాశాలలో నమోదు చేసుకోవాలన్నారు. బీఏ (హెచ్ఈపీ,టీహెచ్‌పీ,యూహెచ్‌పీ), బీకామ్ (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ (ఎంపీసీఎస్,ఎ ంపీసీ, సీజడ్ఎస్,బీజడ్‌సీ, పారామెడికల్) గ్రూపులు ఉన్నాయన్నారు. వృత్తి నైపుణ్య కోర్సులు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైలర్ డెబిట్ రికవరీ ఏజెంట్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. కుట్టు శిక్షణ, కెరీర్ గైడెన్స్ సెల్ లాంటి వృత్తి విద్యా కోర్సులతో పాటు పీజీ ఎంఎస్సీ జువాలజీ, ఎంఏ తెలుగు, ఎంకామ్ జనరల్, సెరికల్చర్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నల్లమాడ: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం (రేపు) ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు.

5 నుంచి బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టులో ఈ నెల 5 నుంచి ఉచిత బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి హిదయ్‌తుల్లాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9030944717, 9391710032 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో కుర్లపల్లప్పయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఆలయం వద్ద గంగపూజ, గోపూజ, గణపతి పూజ, బలిహరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు శరత్ కుమార్, వేదపండితులచే నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

రామగిరి: రాష్ట్రప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కాగా చేరవేసే బాధ్యత సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఉందని డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పేరూరు, దుబ్బార్లపల్లి, నసనకోట, మాదాపురం గ్రామాల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వలంటీర్లు విధులను సక్రమంగా నిర్వహిస్తూ అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలన్నారు. సందర్భంగా ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆజాద్, జెడ్పీటీసీ సభ్యుడు గోసే నాగార్జున, సర్పంచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.